జేఎన్‌టీయూకు వీసీ ఉన్నట్టా.. లేనట్టా!

- టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా నియామకంతో ఖాళీగా వీసీ పోస్టు
- అంబేడ్కర్ వర్ధంతి సభ షెడ్యూల్‌లో వీసీ కోసం స్లాట్ పెట్టిన జేఎన్‌టీయూ అధికారులు
- వైస్ చాన్స్‌లర్ ఎవరు!
- విద్యార్థులు, ఆచార్యుల్లో అయోమయం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జేఎన్‌టీయూకు ఉపకులపతి ఉన్నట్టా, లేనట్టా.. అని ఇటు విద్యార్థులు, అటు ఆచార్యులు సంశయంలో కొట్టుమిట్టాడుతున్నారు. గత మే నెల 21న వైస్ చాన్స్‌లర్‌గా కట్టా నర్సింహారెడ్డి పదవీ కాలం ముగియడంతో.. 22నుంచి ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టారు. అయితే, నవంబరు 30న ఆయన్ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో.. జేఎన్‌టీయూకు ఇన్‌చార్జి వీసీగా ఆయన పదవీకాలం కూడా ముగిసినట్టయింది. గత వారం రోజులుగా ఇన్‌చార్జి కానీ, రెగ్యులర్‌గా కానీ ప్రభుత్వం ఎవరినీ నియమించక పోవడంతో వైస్‌చాన్స్‌లర్ పోస్టు ఖాళీగానే ఉంటోంది. ఫలితంగా యూనివర్సిటీలో అభివృద్ధి పనులు, అకడమిక్ అంశాలపై నిర్ణయం తీసుకునేందుకు పెద్దదిక్కు లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే, ఎక్కడి ఫైళ్లు అక్కడే నిలిచిపోయాయి.

డిప్యూటీ సీఎం షెడ్యూల్‌లో 'వీసీ'కి స్లాట్!

జేఎన్‌టీయూలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరు కానున్నట్టు వర్సిటీ ఉన్నతాధికారులు ప్రకటించారు. ఈ మేరకు అంబేడ్కర్ వర్ధంతి సభ షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. యూనివర్సిటీకి వీసీ పోస్టులో రెగ్యులర్ లేదా ఇన్‌చార్జిగా ప్రభుత్వం ఎవర్నీ నియమించక పోయినప్పటికీ, మీటింగ్ షెడ్యూల్‌లో మాత్రం వైస్ చాన్స్‌లర్ ప్రసంగానికి (మధ్యాహ్నం 12.15 గంటల నుంచి 12.30గంటల వరకు) స్లాట్‌ను పెట్టారు. తమ యూనివర్సిటీకి వీసీ ఎవరో ఎవరికీ తెలియకున్నా, ఆయన ప్రసంగానికి మాత్రం 15 నిమిషాలు కేటాయిస్తూ రిజిస్ట్రార్ పేరిట విడుదలైన సర్క్యులర్.. యూనివర్సిటీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇంతకీ మన యూనివర్సిటీకి వీసీ ఎవరబ్బా అంటూ అయోమయంగా ఒకర్ని మరొకరు ప్రశ్నించుకుంటున్నారు.

సమస్యలు పరిష్కరిస్తారా!

ఆర్నెల్లుగా వర్సిటీకి వైస్ చాన్స్‌లర్ లేకపోవడం, గత పదేళ్లుగా యూనివర్సిటీకి రావాల్సిన గ్రాంట్లు అందకపోవడం, వర్సిటీ అనుబంధంగా ఉన్న కాలేజీల్లో బోధన, బోధనేతర సిబ్బంది కొరత.. తదితర అంశాలపై డిప్యూటీ సీఎంకు వినతిపత్రాలు ఇవ్వాలని విద్యార్థి సంఘాల, ఆధ్యాపక సంఘాల ప్రతినిధులు సన్నద్ధమవుతున్నారు. డిప్యూటీ సీఎం రాకతోనైనా తమ యూనివర్సిటీకి సంబంధించి ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. పనిలో పనిగా యూనివర్సిటీలో రూ. 50 కోట్లతో నిర్మించిన గోల్డెన్ జూబ్లీ భవనాన్ని కూడా డిప్యూటీసీఎం చేతుల మీదుగా ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



జేఎన్‌టీయూ పరిపాలనా భవనం

ఇన్‌చార్జి వీసీ పోస్టుకు పెరిగిన పోటీ

జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ పోస్టుకు రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే ప్రత్యేకత ఉంది. జాతీయ స్థాయిలో అతిపెద్ద సాంకేతిక విశ్వవిద్యాలయం కావడంతో ఈ యూనివర్సిటీ వీసీ పోస్టును అర్హత కలిగిన ప్రొఫెసర్లందరూ ప్రతిష్టాత్మకంగా భావిస్తారు. రాష్ట్రంలో ఏ యూనివర్సిటీకి రాని విధంగా జేఎన్‌టీయూ వీసీ పోస్టుకు 100కు పైగా దరఖాస్తులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన ప్రొఫెసర్ల నుంచి రావడమే ఇందుకు నిదర్శనం. అయితే.. అనివార్య కారణాలతో జేఎన్‌టీయూ వీసీ నియామకం ఆలస్యం కావడంతో ఇన్‌చార్జి వీసీ పోస్టుకోసం కూడా పోటీ నెలకొంది. నిన్న మొన్నటివరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఇన్‌చార్జి వీసీగా ఉండగా, ప్రస్తుతం ఆయన పోస్టులో అదనపు బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారికి జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ఉన్న డాక్టర్ బాలకిష్టారెడ్డి లేదా ఉస్మానియా యూనివర్సిటీకి వీసీగా ఉన్న ప్రొఫెసర్ కుమార్ కూడా ఇన్‌చార్జి వీసీగా నియమితులయ్యే అవకాశం ఉన్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వర్సిటీ నుంచి వీసీ పోస్టుకు దరఖాస్తు చేసిన కొందరు సీనియర్ ప్రొఫెసర్లు కూడా తాత్కాలిక వీసీగా అయినా బాధ్యతలు చేపట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. జేఎన్‌టీయూ వీసీ నియామకంపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని, రెగ్యులర్ లేదా ఇన్‌చార్జి వీసీని తక్షణం నియమించి ఈ ఉత్కంఠకు తెరదించాలని విద్యార్థి సంఘాలు, అధ్యాపక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్, వెంకటేశ్వరరావు

హైదర్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తోందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది బిల్లుల పరిహార్థం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న కూకట్‌పల్లి దీనబంధుకాలనీకి చెందిన సరోజ, శివనగర్‌లో నివాసం ఉండే తుమమలి శ్రీనివాస్‌కు రూ.60 వేలు, 45 వేలు మంజూరు అయ్యాయి. ఈమేరకు గురువారం ఆ చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు కార్యాలయంలో జగదీశ్వర్‌గౌడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, విష్ణు, రఘుగౌడ్, శంకర్‌రావు, పరుశురాం, అరుణ్, రాహుల్, గైక్వాడ్ పాల్గొన్నారు.



● అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది బిల్లుల పరిహార్థం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 24 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.9,79,000 చెక్కులను తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- హైదర్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి)

చలో బస్‌భవన్‌కు ఆర్టీసీ జేఏసీ నాయకులు



కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో నుంచి బస్‌బవన్‌కు వెళ్తున్న జేఏసీ నాయకులు

ఫతేనగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): టీజీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ జేఏసీ నాయకులు గురువారం బస్ భవన్‌కు బయలు దేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఆశ చూపి ఆర్టీసీ యూనియన్‌కు మసి బూసి మారేడు కాయను చేసి యూనియన్ల ఉనికిని లేకుండా చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ కష్టాలను పట్టించుకుంటుందని ఆశిస్తే ఈ ప్రభుత్వం కూడా ఆర్టీసీని, ఆర్టీసీ కార్మికులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు.


చిన్నారులకు యూనిఫాంలు అందజేత



బాలానగర్‌లోని అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం అందజేస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. అంగన్ వాడీ కేంద్రాల చిన్నారులకు ప్రభుత్వం ఇచ్చిన యూనిఫాంలను చిన్నారులకు అందజేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అంగన్ వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కొన సాగుతున్నాయని, సకాలంలో ప్రభుత్వం అద్దెలు చెల్లించకపోవడంతో అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు తమకు వచ్చే జీతంలోంచి అద్దెలు చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సకాలంలో అద్దెలు చెలించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వరూప, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రామారావు నగర్‌లో..



యూనిఫాంలు అందుకున్న చిన్నారులతో అధికారులు

అల్లాపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రామారావు నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అనిత ఆధ్వర్యంలో గురువారం 55 మంది చిన్నారులకు యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ కూకట్‌పల్లి బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, ఏ.సంజీవ, జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయినులు విజయకుమారి, మాధవి, హేమలత, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తిలో పెరుగుతున్న రసాయనికీకరణ

- పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు నర్సింహా రెడ్డి

అమీర్‌పేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఆహార ఉత్పత్తిలో రసాయనికీకరణ పెరుగుతోందని పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు డాక్టర్ నర్సింహారెడ్డి విచారం వ్యక్తం చేశారు. అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులు, కలుపు సంహారకాల ప్రతికూల ప్రభావాలపై జాతీయ సింపోజియం అమీర్‌పేటలోని సెస్ ఆడిటోరియంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం అంతటా ప్రమాదకరమైన పురుగుమందులను పిచికారీ చేయడం వల్ల గ్రామీణ కుటుంబాలు బలహీనపడుతున్నాయన్నారు. ప్రతి పంట సీజన్‌లో భోపాల్ గ్యాస్ ట్రాజెడి మాదిరిగా ప్రతి గ్రామం గ్యాస్ చాంబర్‌గా మారి గ్రామీణ పరిసరాలు దయనీయమైన స్థితిలో ఉన్నయని పేర్కొన్నారు. అనంతరం పాన్ ఇండియా సీఈఓ మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా ఎగుమతి చేయబడిన, దిగుమతి చేసుకున్న పురుగుమందులలో ఎచ్‌ఎచ్‌పీలు ఉన్నాయని భారతదేశంలో నమోదు చేయబడిన ఈ హెచ్‌హెచ్‌పీలను చాలా వరకు భద్రత కోసం సరిగా అధ్యయనం చేయలేదని ఎందుకంటే అవి క్రిమిసంహారక చట్టం 1968 అమలులోకి రావడానికి ముందు వాడుకలో ఉన్నాయన్నారు. ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ హెచ్‌హెచ్‌పీలపై నిషేధాన్ని సమర్ధించడంలో ప్రచారకులు ప్రయత్నాల్లో ఉండాలని వైద్య సోదరులకు ఉద్బోదించారు. పాన్ ఇండియా నుంచి హీరా సీకే, రోష్నీలు కలుపు సంహారకాలపై తమ పరిశోధన ఫలితాలను సమర్పించారు. మన ఆహారం, గాలి, నీరు, నేల విషపూరిత వ్యవసాయ రసాయనలతో కలుషితమైందని పరిశోధనలో వెల్లడించారు. జీవవైవిధ్యాన్ని పురుగుమందుల ప్రతికూల ప్రభావాల నుండి రక్షించడానికి దేశంలో అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులు, కలుపు సంహారకాలను నిషేధించాల్సిన తక్షణ అవసరాన్ని ఈ సింపోజియం డిమాండ్ చేసింది. కార్యక్రమంలో రెండు నివేదికలను విడుదల చేశారు.

సమస్యలపై సత్వర స్పందన ఉండాలి



కాలనీ ప్రతినిథులు, పౌరసేవల అధికారుల సమావేశంలో కార్పొరేటర్ సబీహా బేగం

అల్లాపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులపై అధికారులకు సత్వర స్పందన ఉండాలని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా బేగం పేర్కొన్నారు. డివిజన్ వార్డు కార్యాలయంలో గురువారం ఆమె వివిధ శాఖల అధికారులు, డివిజన్‌లోని కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీపీడీసీఎల్, జలమండలి, శానిటేషన్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో అనేక బస్తీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు తమతమ కాలనీల్లో నెలకొన్న సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. సమస్యలలో ఎక్కువగా సీసీ రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాళ్లు కావాలని విన్నపాలు, తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ సంబంధిత ఫిర్యాదులు అధికంగా ఉండగా విద్యుత్ స్తంభాలు, తీగలు, విద్యుద్దీపాలు, చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, వీధుల్లో కొరవడిన పారిశుద్యంపై కూడా ఫిర్యాదులందాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలకు ఉపక్రమించాలంటూ కార్పొరేటర్ సబీహ బేగం అధికారులను కోరారు. సమావేశంలో డీ.ఈ.శంకర్, ఏఈ రంజిత్, ఏఎంఓహెచ్ కార్తీక్, డీజీఎం శిరీష, ఎస్ఆర్‌పీ సురేష్, జలమండలి మూసాపేట్ సెక్షన్ మేనేజర్ విలియం ప్రకాష్, సీపీడీసీఎల్ ఏఈ రాకేష్, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా



నేల కొరిగిన ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ ప్రజలకు ఏ కష్టం వచ్చినా వారికి అండగా ఉంటానని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ డివిజన్ ప్రజలకు హామీ ఇచ్చారు. డివిజన్ పరిధి నాగార్జున కాలనీ, అక్షయ్ ఎన్‌క్లేవ్‌లను కలుపుతూ ఉండే ఫెన్సింగ్ బుధవారం నేలకొరగడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో కార్పొరేటర్ ఆ ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. అధికారులతో చర్చించి ఎస్టిమేషన్ తయారు చేయించి నిధులు రాగానే పనులు సత్వరమే పూర్తయ్యేలా చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మూసాపేట సర్కిల్ డీఈ శంకర్, డివిజన్ ఏఈ రంజిత్, బీఆర్‌ఎస్ నాయకులు భిక్షపతి, శశి, కన్నయ్య, సలావుద్దీన్, బస్వరాజ్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టు దుర్మార్గం'

హైదర్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటికి పోలీసులు వచ్చారని తెలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజుతో మాజీ కార్పొరేటర్ రంగారావు వెళ్లారు. వీరిని పోలీసులు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ రంగారావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన ఫోన్ ట్యాప్ చేస్తున్నారని ఫిర్యాదు చేయడానికి వెళ్తే తిరిగి ఆయనపై కేసుపెట్టి అరెస్టు చేయడం దుర్మార్గమని అన్నారు. సీఎం రేవంత్ సర్కార్ ఓవైపు ప్రజాపాలన దినోత్సవాలు జరుపుకొంటూ మరోవైపు ప్రతిపక్షం గొంతు నొక్కుతున్నారని, ఇది రాజకీయ కక్ష సాధింపు చర్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

భవనం పైనుంచి పడిన కస్తూర్బా విద్యార్థిని

- ఘటనపై అనుమానాలు



రేణుక

రామాయంపేట/అడ్డగుట్ట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాల భవనంపై నుంచి పడి విద్యార్థిని గాయాలైన సంఘటన మెదక్ జిల్లా రామాయంపేటలో జరిగింది. గురువారం ఈ ఘటన జరగగా, పాఠశాల సిబ్బంది విషయాన్ని బయటకు రానివ్వలేదు. మొదట చిన్న గాయమైనని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అయితే, విద్యార్థిని ఎముకలు విరినట్లు తెలియడంతో గురువారం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరా లు ఇలా ఉన్నాయి. రామాయంపేట వడ్డెర కాలనీకి చెందిన రేణుక కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కొన్ని రోజుల నుంచి ఆమె గైర్హాజరు కాగా, రెండు రోజుల క్రితమే పాఠశాలకు వెళ్లింది. బుధవారం సాయంత్రం పై అంతస్తుపై దుస్తులు ఆరేసేందుకు వెళ్లి.. మెట్లపై నుంచి పడి కింది అంతస్తు వరకు దొర్లుతూ వచ్చినట్లు పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. గమనించిన వారు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. గురువారం ఉదయం వరకూ విద్యార్థిని ఆరోగ్యం కుదుట పడకపోవడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసి మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజనీలు గురువారం పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. ప్రిన్సిపాల్ విద్యార్థినితో పాటే ఆస్పత్రిలో ఉండటంతో పూర్తి వివరాలు తెలియరాలేదు.

ధర్మసమాజ్ నేతల రిలే నిరాహార దీక్ష



మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టిన ధర్మసమాజ్ పార్టీ నేతలు

బాలానగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉచిత విద్య వైద్యం, అర్హులైన వారికి ఉపాధి, ఇళ్లు, భూమి ఇవ్వాలని ఐదు డిమాండ్ల సాధన కోసం ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా ధర్మసమాజ్ పార్టీ నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎదుట పెట్టిన ఐదు డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని వారు పేర్కొన్నారు. ఈ రిలే దీక్షల్లో ధర్మసమాజ్ పార్టీ నేతలు శివకుమార్, గుండేటి నర్సింగ్‌రావు, పరుశరామ్, శ్రీధర్, మల్లేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ కూకట్‌పల్లి అధ్యక్షుడిగా ఎండీ సలీం ఉద్దీన్



సలీం ఉద్దీన్‌ను సత్కరించి స్వీట్ తినిపిస్తున్న మోయిజ్ తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎండీ సలీం ఉద్దీన్ 1258 ఓట్లతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మోయిజ్, సతీష్‌రెడ్డి తదితరులు సలీంను సత్కరించి, స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. తనకు ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ సలీం కృతజ్ఞతలు తెలిపారు. యువతను పార్టీలోకి ఆహ్వానించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్ కృష్ణయ్య, రామకృష్ణ తదితరులు

బర్కత్‌పుర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ ఆర్. కృష్ణయ్య తెలిపారు. బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఫీజుల పోరును ప్రజా ఉద్యమంగా మారుస్తామని, లా అండ్ ఆర్డర్ సమస్య తప్పదని ఆయన హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముట్టడి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతుందన్నారు. విదేశీ విద్య పథకం కింద రూ. 20లక్షల స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని, బీసీ కళాశాల హాస్టళ్లు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను రూ.200 కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు నీల వెంకటేష్, మల్లేష్ యాదవ్, సి.రాజేందర్, జిల్లపల్లి అంజి, నందగోపాల్ పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.31, వంకాయ రూ.23, బెండకాయ రూ.28, పచ్చి మిర్చి రూ.25, బజ్జి మిర్చి రూ.25, కాకరకాయ రూ.20, బీరకాయ రూ.32, క్యాబేజీ రూ.23, బీన్స్ రూ.28, క్యారెట్ రూ.45, గోబి పువ్వు రూ. 23, దొండకాయ రూ.28, చిక్కుడు కాయ రూ. 35, గోరు చిక్కుడు రూ.23, బీట్‌రూట్ రూ. 43, క్యాప్సికం రూ.58, ఆలుగడ్డ రూ.35, కీర రూ.18, దోసకాయ రూ.23, సొరకాయ రూ. 20, పొట్లకాయ రూ.20, కంద రూ. 60, ఉల్లిపొరక రూ.45, ఉల్లిగడ్డ రూ.49, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ. 8-9, చామగడ్డ రూ.35, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.40, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.18-20, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ. 160, వెల్లుల్లి రూ.400, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.40, కరివేపాకు రూ.80, పర్వల్ రూ.45, పల్లికాయ రూ. 55, లోబా రూ.20, ఆ కాకరకాయ రూ.95. పైన పేర్కొన్న ధరలు శనివారం ఉదయం 9.30 వరకు అందుబాటులో ఉంటాయి.

రేపు దివ్యాంగుల దినోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో శనివారం కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ వద్ద ప్రపంచ దివ్యాగుల దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు వెంకటస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని దివ్యాంగులందరూ హాజరై బ్యాటరీ సైకిల్స్, వీల్ చైర్స్, చంక కర్రలు తీసుకోవాలని కోరారు.

లులు మాల్‌లో సీఫుడ్ ఫెస్టివల్



సీ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): లులు మాల్‌లో గురువారం లులు మాల్ స్టేట్ రీజనల్ డైరెక్టర్ ఖదీర్, లులు హైపర్ మార్కెట్ జీఎం విమేష్‌తో కలిసి తెలంగాణ ఫిషరీస్ డిపార్ట్‌మెంటు అడిషనల్ డైరెక్టర్ డా.ఎస్.మురళీకృష్ణ సీ-ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో ఫుడ్ ప్రియులను దృష్టిలో ఉంచుకుని జాతీయంగా వివిధ ప్రదేశాల్లో దొరికే అన్ని రకాల సీ-ఫుడ్స్ ఇక్కడ అందుబాటులో ఉంచడం సంతోషంగా ఉందన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో దొరికే చేపలు నగరవాసులకు అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు సీ-ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణా నాయక్ తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సీపీఎం మహాసభలను విజయం వంతం చేయాలని ఆ పార్టీ కూకట్‌పల్లి మండల నాయకుడు కె.కృష్ణానాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈనెల 7,8 తేదీల్లో ప్రగతినగర్‌లో నిర్వహించనున్న మహాసభల పోస్టర్‌ను గురువారం కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్ వద్ద ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, చిరంజీవి, గోపాలు, మగ్యా, కృష్ణ, బాలు, భాష, గోబ్రియా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అస్తిత్వంపై సీఎం దాడి

- రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్




గతంలో రూపొందించిన తెలంగాణ తల్లి, భారత మాత నమూనా చిత్రాలను ప్రదర్శిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు

పంజాగుట్ట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తున్నారని, తెలంగాణ తల్లి రూపం మార్చే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆరోపించారు. తెలంగాణ తల్లి కిరీటం, బతుకమ్మ తీసేస్తామని అనడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్.ఉపేంద్ర, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్తి నరసింహ, విద్యాసాగర్‌లతో కలిసి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసి నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నాడని, దీనిలో భాగంగానే తెలంగాణ తల్లి రూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సమైక్యవాదుల కనుసన్నల్లో ప్రజాపాలన చేస్తున్న సీఎం తెలంగాణ అస్తిత్వంపై జరిపే దాడిని ఖండిస్తున్నామని అన్నారు. మూడు కోట్లకు పైగా ఉన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అస్తిత్వానికి ప్రతి రూపమే తెలంగాణతల్లి అన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి పుట్టిందే తెలంగాణ తల్లి అన్నారు. తెలంగాణ తల్లి రూపం మార్చే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలన్నారు. తెలంగాణలో సమృద్ధిగా పండే పంటలు, బతుకమ్మ, పట్టు వస్త్రాలు ధరించి వైభవంగా చూపాలని ఆలోచన చేశారు. రూపాన్ని మారిస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

క్యాబినెట్ మంత్రులకు కూడా తెలియకుండా రహస్యంగా విగ్రహం తయారు చేయిస్తున్నారని, ఎందుకీ రహస్యం అన్నారు. తెలంగాణ తల్లి రూపం తెచ్చిన సమయంలో ప్రొఫెసర్ కోదండరామ్ కూడా ఉన్నారు. ఇప్పుడు మారుస్తామని చెప్తే ఎలా అని ప్రశ్నించారు. కాకతీయ తోరణం, చార్మినార్ కూడా తీసేస్తామని అంటున్నారు. రూపం ఎందుకు మార్చే ప్రయత్నం చేస్తున్నారు. విగ్రహం రూపం మారుస్తుంటే కోదండరామ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చరిత్ర మీద అవగాహన లేకనే రేవంత్ రెడ్డి అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.

బస్తీలకు ఆదర్శంగా బతుకమ్మబండ


అభివృద్ధి చెందిన బతుకమ్మ బండ

గాజులరామారం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని బతుకమ్మబండ అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. ఒకప్పుడు ఆ ప్రాంతానికి వెళ్లాలంటేనే వెన్నులో ఒణుకు పుట్టేది. ఎటు చూసినా చెట్ల పొదలు, ముళ్ల కంచెలు ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం దినదినాభివృద్ధి చెందుతూ పలు బస్తీలు, కాలనీలకు ఆదర్శంగా నిలుస్తోంది. 2002లో ఈ బస్తీ ఏర్పడినప్పుడు కొద్దోగొప్పో జనాభా నివాసిస్తుండేది. ప్రస్తుతం 2 వేల కుటుంబాలు ఇక్కడ నివాసం ఉంటున్నాయి. రోజురోజుకు బస్తీ విస్తరిస్తూ జనాభా కూడా

స్థానికుల ఐకమత్యంతో పురోభివృద్ధి

పెరుగుతోంది. దాంతోపాటే స్థానిక నాయకులు, అధికారులు ప్రజలకు మౌలిక సదుపాయాలనూ కల్పిస్తున్నారు.

బస్తీలో మతసామరస్యం వెల్లివిరుస్తోంది. నాయకులు, అధికారుల సహాయ సహకారంతో శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాల్, పోచమ్మగుడి, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, సయ్యద్ సాదుల్లా హుస్సేన్‌బాబా దర్గాను బస్తీవాసులు నిర్మించుకున్నారు. ఇంతేగాక తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

బతుకమ్మబండగా..

ఒకప్పుడు ఈ బస్తీలో ఒక పెద్ద పరుకుబండ ఉండేది. గాజులరామారం గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ప్రజలు బతుకమ్మ పండుగను ఈ బండపై జరుపుకునేవారు. అందుకే ఈ బస్తీకి బతుకమ్మబండగా పేరు వచ్చిందని పలువురు తెలుపుతున్నారు. బతుకమ్మను ఆడి, సమీపంలో ఉన్నచింతల చెరువులో వదిలి వెళ్లేవారు.

అభివృద్ధి పథంలో



బతుకమ్మ బండ బస్తీ రోజురోజుకు జనాభా పెరుగుతుంది. దానికి తగ్గట్టుగా నాయకులు, అధికారులు ఈ బస్తీని అభివృద్ధి చేస్తూ, ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

- చెట్ల వెంకటేష్, స్థానికుడు

ఆధ్యాత్మిక శోభ ఎక్కువ



ఈ బస్తీలో కుల మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పండుగలను జరుపుకుంటారు. సాయంత్రం అయిందంటే దేవాలయంలో కీర్తనలు, భజనల కార్యక్రమాలను నిర్వహిస్తారు.

- పరమేశ్వర పంతులు, బస్తీవాసి


పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం


సయ్యద్ సాదుల్లా దర్గా


పోచమ్మ గుడి

ట్రాన్స్‌ఫార్మర్లతో పొంచి ఉన్న ప్రమాదం

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీ నుంచి రుక్మిణీ ఎస్టేట్ దేవాలయానికి వెళ్లే రహదారి పక్కనే ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ప్రమాదం పొంచి ఉంది. గాలి వచ్చినప్పుడల్లా ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు చెట్టు కొమ్మలు తగిలి మంటలు చెలరేగడం, దీని పక్కనే ఉన్న మరో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌బాక్స్ మూత పగిలిపోవడంతో గుమ్మడి తీగలు అంటుకొని మంటల వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో విద్యుత్‌ను నిలిపి వేసి, చెట్టు కొమ్మలను తొలగించే విద్యుత్ అధికారులకు కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల ప్రమాదం పొంచి ఉన్నదని కనిపించడం లేదా? అని స్థానికులు, పాదాచారులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి ఫ్యూజ్ బాక్సు మూత మార్చాలని, ట్రాన్స్‌ఫార్మర్లకు తగులుతున్న చెట్టు కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.


మూత లేని ఫ్యూజ్ బాక్సు


ట్రాన్స్‌ఫార్మర్‌కు తగులుతున్న చెట్టు కొమ్మలు

పగిలిపోయిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలి

పేట్‌బషీరాబాద్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ పైప్‌లైన్ రోడ్డులోని తిరుమల వైన్స్ సమీపంలో తాగునీరు వృథాగా పోతుంది. పైప్‌లైన్ పగిలి తాగునీరు పోతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. జలమండలి అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డు పక్కన వృథాగా పోతున్న తాగునీరు


ఎంపికైన ఎస్సైలు, సిబ్బందికి శిక్షణనిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

నిజాయితీగా పని చేస్తే పేరు ప్రతిష్ఠలు

● మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : పోలీసులు వృత్తి నిబద్ధత, నిజాయితీగా పని చేసినప్పుడే ప్రజల్లో మంచి పేరు వస్తుందని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. నూతనంగా ఎంపికైన ఎస్సైలు, పోలీసు సిబ్బందికి ఏడు రోజుల నుంచి పేట్ బషీరాబాద్ పీఎస్ సమావేశ మందిరంలో ఆయన పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములుతో కలిసి వారికి పోలీసు వృత్తిపై శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎప్పటికప్పుడు కేసులను ఛేదిస్తూ వృత్తి నైపుణ్యంలో తమ ప్రతిభను ప్రదర్శించినప్పుడే వ్యవస్థలో మంచి పేరుప్రతిష్ఠలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పార్కు పక్కన పేరుకుపోయిన చెత్త

పార్కు పక్కన చెత్తను తరలించరా..?

పేట్ బషీరాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ సుచిత్ర వెంకటేశ్వరకాలనీలోని పార్కు పక్కనే చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వచ్చే ప్రజలు వాకింగ్ చేయలేకపోతున్నామని, సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని తెలిపారు. ఈ చెత్త రోజుల తరబడి ఉన్నా పారిశుధ్య సిబ్బంది తీసుకువెళ్లడం లేదని, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


యూత్ కాంగ్రెస్‌లో గెలుపొందిన వారిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

గెలుపొందిన నాయకులకు సన్మానం

షాపూర్‌నగర్, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన నాయకులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్‌ని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన నల్లా అరుణ్ కుమార్‌గౌడ్, 125వ డివిజన్ గాజులరామారం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ షేక్ సల్మాన్‌లను శ్రీశైలంగౌడ్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూన రాఘవేంద్రగౌడ్, జిల్లా వెంకట్, వేణు చింటూ, కార్తీక్, అవినాష్ మథ్యూస్, భాను, మహేష్, జ్ఞానేశ్వర్, అభిలాష్, బంటి, చింటూ షేక్ అహ్మద్, అక్బర్, లాల్ మహ్మద్, షేర్ మహ్మద్, ఇస్మాయిల్ సోహెల్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు

రేడియం స్టిక్కర్లను అతికించండి

గాజులరామారం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని మల్లారెడ్డినగర్ నుంచి శ్రీరాంనగర్ కాలనీ వరకు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఈ మధ్యకాలంలో ఓ భారీవాహనం శ్రీరాంనగర్ మూలమలుపులో ఉన్న స్తంభాన్ని ఢీకొట్టడంతో విరిగిపోయింది. అధికారులు స్పందించి విద్యుత్‌ను నిలిపివేయడంతో ప్రమాదం తప్పిందని పలువురు తెలుపుతున్నారు. రాత్రివేళల్లో ఈ స్తంభాలకు రేడియం కూడా లేకపోవడంతో వాటిని గుర్తించడం కష్టతరమవుతుందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాత్కాలికంగా రేడియం స్టిక్కర్లను అతికించగలరని, సాధ్యమైనంత త్వరగా స్తంభాలను రోడ్డు పక్కకు వేయించాలని మల్లారెడ్డినగర్ వాసులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి


జగద్గిరిగుట్ట పైపులైను రోడ్డు చౌరస్తా వద్ద అడ్డదిడ్డంగా వాహనాలు

షాపూర్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గాజులరామారం ప్రధాన రహదారిలో రోజురోజుకు పెరిగిపోతున్న వాహనాల రద్దీ, జనాభా కారణంగా నిత్యం ట్రాఫిక్ జాం అవుతుంది. ప్రమాదాలను నివారించేందుకు ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ట్రాఫిక్ సీఐకి వినతి పత్రాలు సమర్పించారు. ప్రధాన చౌరస్తాల్లో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించడంలేదు. వారిని అడ్డుకొనేందుకు ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో గంటలకొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ జాం అయ్యే ప్రధాన కూడళ్లు

గాజులరామారం ప్రధాన రహదారిలోని జగద్గిరిగుట్ట పైపులైను రోడ్డు సమీపంలో ఇరువైపుల నుంచి వచ్చే వాహనదారులతో ఇబ్బందిగా మారింది. ఈ కూడలిలో గతంలో పలు ప్రమాదాలు జరిగాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుచేయాలనే డిమాండ్ పెరిగింది. సాయంత్రం పూట ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉన్నా సక్రమంగా విధులను నిర్వర్తించడం లేదు. మరో కూడలి ఖాజాపాన్‌షాప్ చౌరస్తా వద్ద కూడా ఇదే పరిస్థితి. దానికితోడు ఈ చౌరస్తా వద్ద వైన్స్‌షాపు, ఇక్కడే మసీదు కూడా ఉంది. దీంతో ఈ కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. దాంతోపాటుగా వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. వీటిని అధిగమించేందుకు సిగ్నల్స్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.


రోడామిస్త్రీనగర్ చౌరస్తావద్ద ట్రాఫిక్ జామ్

సిగ్నల్స్ ఏర్పాటుచేయాలి



ఈ రోడ్డులో వాహనాలు, రాకపోకలు పెరగడంతోనే ట్రాఫిక్ జామ్ అవుతోంది. వాహనదారులు విచ్చలవిడిగా వాహనాలు నడపడం, రాంగ్‌రూట్ డ్రైవింగ్ మరో కారణంగా చెప్పవచ్చు. సిగ్నల్స్ ఏర్పాటుచేసే వరకైనా ఈ చౌరాస్తాల్లో ట్రాఫిక్ కానిస్టేబుల్‌ని నియమించాలి.

- ప్రభుదాసు, నెహ్రూనగర్

ఇరుకురోడ్ల వల్లనే..



ప్రధాన రహదారి ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. గతంలో రోడ్డు విస్తరణ చేపట్టినా, ప్రస్తుతం పెరిగిన వాహనాలతో ఇరుకుగా మారింది. దీనికి తోడు తోపుడు బండ్లు, ఛాయ్ డబ్బాలు ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ లేని కారణంగా విచ్చలవిడిగా వాహనదారులు వెళ్లడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. సాధ్యమైనంత త్వరగా సిగ్నల్స్ ఏర్పాటు అవసరం.

- నఫీజ్, రోడామిస్త్రీనగర్


వార్డు కార్యాలయంలో మందుబాటిళ్లు

మందుబాబులకు అడ్డాగా వార్డు కార్యాలయం

జీడిమెట్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయం మందు బాబులకు అడ్డాగా మారిందని, మద్యం సేవించి మందు బాటిళ్లను కార్యాలయంలోనే పడవేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వార్డు కార్యాలయం చెత్తా చెదారాలతో నిండిపోయినా అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. అదేవిధంగా కార్యాలయంలో ఉన్న బస్తీ దావాఖానా పరిస్థితి దారుణంగా ఉంది. రోగులు కూర్చునేందుకు సరైన కుర్చీలు కూడా లేవు.

గాజులరామారం సర్కిల్ అధికారులు చర్యలు తీసుకుని, వార్డు కార్యాలయాన్ని సక్రమైన దారిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆహార ఉత్పత్తిలో పెరుగుతున్న రసాయనికీకరణ

● పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు నర్సింహా రెడ్డి

అమీర్‌పేట, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఆహార ఉత్పత్తిలో రసాయనికీకరణ పెరుగుతోందని పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు డాక్టర్ నర్సింహా రెడ్డి విచారం వ్యక్తం చేవారు. అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులు, కలుపు సంహారకాల ప్రతికూల ప్రభావాలపై జాతీయ సింపోజియం అమీర్‌పేటలోని సెస్ ఆడిటోరియంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం అంతటా ప్రమాదకరమైన పురుగుమందులను పిచికారీ చేయడం వల్ల గ్రామీణ కుటుంబాలు బలహీనపడుతున్నాయన్నారు. ప్రతి పంట సీజన్‌లో భోపాల్ గ్యాస్ ట్రాజెడి మాదిరిగా ప్రతి గ్రామం గ్యాస్ చాంబర్‌గా మారీ గ్రామీణ పరిసరాలు దయనీయమైన స్థితిలో ఉన్నయని పేర్కొన్నారు. పాన్ ఇండియా సీఈఓ మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా ఎగుమతి చేయబడిన, దిగుమతి చేసుకున్న పురుగుమందులలో ఎచ్ఎచ్‌పీలు ఉన్నాయని భారతదేశంలో నమోదు చేయబడిన ఈ హెచ్‌హెచ్‌పీలను చాలా వరకు భద్రత కోసం సరిగా అధ్యయనం చేయలేదని ఎందుకంటే అవి క్రిమిసంహారక చట్టం 1968 అమలులోకి రావడానికి ముందు వాడుకలో ఉన్నాయన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ హెచ్‌హెచ్‌పీలపై నిషేధాన్ని సమర్థించడంలో ప్రచారకులు ప్రయత్నాల్లో ఉండాలని వైద్య సోదరులకు ఉద్బోధించారు. పాన్ ఇండియా నుంచి హీరా సీకే, రోష్నీలు కలుపు సంహారకాలపై తమ పరిశోధన ఫలితాలను సమర్పించారు. మన ఆహారం, గాలి, నీరు, నేల విషపూరిత వ్యవసాయ రసాయనలతో కలుషితమైందని పరిశోధనలో వెల్లడించారు. జీవవైవిధ్యాన్ని పురుగుమందుల ప్రతికూల ప్రభావాల నుండి రక్షించడానికి దేశంలో అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులు, కలుపు సంహారకాలను నిషేధించాల్సిన తక్షణ అవసరాన్ని ఈ సింపోజియం డిమాండ్ చేసింది. కార్యక్రమంలో రెండు నివేదికలను విడుదల చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహా రెడ్డి దొంతి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

● 10న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి

బర్కత్‌పుర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఫీజుల పోరును ప్రజా ఉద్యమంగా మారుస్తామని, లా అండ్ ఆర్డర్ సమస్య తప్పదని ఆయన హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముట్టడి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతుందన్నారు. విదేశీ విద్య పథకం కింద రూ.20 లక్షల స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని, బీసీ కళాశాల హాస్టళ్లు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను రూ.200 కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు నీల వెంకటేష్, జి.మల్లేష్‌యాదవ్, సి.రాజేందర్, జిల్లపల్లి అంజి, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, రామకృష్ణ తదితరులు

కిందపడి వ్యక్తి మృతి

జీడిమెట్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాపూర్‌నగర్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి సమీపంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి కుప్పకూలి మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సురేష్ అనే వ్యక్తి గురువారం బస్సు దిగి నడుచుకుంటూ వెళుతూ, ఆకస్మాత్తుగా కిందపడి ప్రాణాలు వదిలాడు. అతని దగ్గర ఉన్న ఆధారాలతో కుత్బుల్లాపూర్‌లోని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు సురేష్


లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కుత్బుల్లాపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ పరిధిలోని సుభాశ్‌చంద్రబోస్‌నగర్‌కు చెందిన శంషుద్దీన్, భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన జి.అశోక్‌లు అనారోగ్యాలకు గురై, చికిత్స చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక సమస్య విషయాన్ని వారు స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి శంషుద్దీన్‌కు రూ.1 లక్ష, అశోక్‌కు రూ.1.15 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు గురువారం బీఆర్‌ఎస్ నాయకులు చింతల్ క్యాంపు కార్యాలయంలో కస్తూరి బాలరాజు, కమలాకర్, మక్సూద్ అలీలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, ఇర్ఫాన్, షౌకత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.


పిల్లలకు దుస్తులు అందజేసిన సొంటిరెడ్డి పున్నారెడ్డి

అంగన్‌వాడీ విద్యార్థులకు దుస్తులు అందజేత

గాజులరామారం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గాజులరామారం డివిజన్‌లోని ప్రకాశంపంతులు నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు యూనిఫామ్స్‌ను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జయ, ఆయా మణికుమారి, ఆశా వర్కర్లు లక్ష్మి, రేఖ, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

తీగలతో పొంచి ఉన్న ప్రమాదం

కుత్బుల్లాపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ గణేషనగర్‌లో విద్యుత్ స్తంభాలకు తీగలను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇలా తీగలు అమర్చడంతో కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయంలో అటుగా వెళ్లే వాహనదారులకు తీగలు అడ్డం తగిలితే కిందపడి, ప్రమాదాలకు గురయ్యే అవకాశముందన్నారు. వీటిని జాగ్రత్తగా అమర్చి ప్రమాదాలు జరుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


గణేష్‌నగర్‌లో వేలాడుతున్న తీగలు


రోడ్డు పక్కన వేసిన చెత్తా చెదారాలు

రోడ్డుపై చెత్త వేసేవారికి జరిమానాలు వేయాలి

కుత్బుల్లాపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మానగర్ రింగురోడ్డు నుంచి సుచిత్ర వెళ్లే రోడ్డులో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. స్థానికులు చెత్తను ఆటోలలో వేయకుండా రోడ్డుపై పడేస్తున్నారని కాలనీ వాసులు తెలుపుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో కవర్లలో తీసుకువచ్చి అక్కడ పడేసి వెళ్తున్నారు. వెరసి దుర్గంధం వెదజల్లుతుందని, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా రోడ్డుపై చెత్త వేసేవారికి జరిమానాలను విధించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నిజాంపేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని మధురానగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అష్టలక్ష్మి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి కాలనీకి చెందిన రామస్వామి కుటుంబ సభ్యులు రూ.1,01,116 లక్షలను విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రామస్వామి కుటుంబ సభ్యులను సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. వస్తు రూపేణా, ధన రూపేణా ఆలయ నిర్మాణంలో పాలుపంచుకోవాలని విష్ణువర్దన్‌రావు, లింగయ్య, హేమంత్‌రావు, రామలక్ష్మారెడ్డి కోరారు.


ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న రామస్వామి కుటుంబం



అవార్డులు అందజేస్తున్న మాజీ ఎంపీ, ఇండియన్ సోలార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహన్

మైండ్‌స్పేస్‌లో 'సూర్యకాన్ హైదరాబాద్-2024'

రాయదుర్గం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మైండ్‌స్పేస్‌లోని హోటల్ ది వెస్టిన్‌లో సూర్యకాన్ హైదరాబాద్-2024 సదస్సును గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ, ఇండియన్ సోలార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహన్, ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ ఎస్‌బీ యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోలార్ ఎనర్జీ డెవలప్‌మెంట్, ఈ రంగానికి మద్దతుగా రూపొందించిన ప్రభుత్వ కార్యక్రమాలపై కీలక చర్చలు జరిగాయి. అనంతరం సౌర విద్యుత్ పరిశ్రమలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేశారు. భారతీయ సోలార్ మాడ్యూల్ తయారీలో అగ్రగామిగా సోవా సోలార్ ప్రశంసలు పొందగా, అగ్రశ్రేణి ఇన్వర్టర్ బ్రాండ్‌గా సోలిస్ అవార్డు అందుకుంది. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీని మర్యాదపూర్వకంగా కలిసిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాకీర్‌పటేల్

యూత్ కాంగ్రెస్ శేరిలింగంపల్లి అధ్యక్షుడిగా జాకీర్‌పటేల్

హైదర్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ శేరిలింగంపల్లి అధ్యక్షుడిగా జాకీర్ పటేల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శేరిలింగంపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జాకీర్‌పటేల్ నియమితులు కావడం యువతలో మరింత ఉత్తేజాన్ని ఇస్తోందని ఎమ్మెల్యే అన్నారు. జాకీర్‌ను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, సమ్మారెడ్డి, చైతన్య, ఎండీ మూసీన్, రమేష్‌నాయక్, అక్షయ్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇరుముడులతో అయ్యప్పస్వాములు

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

చందానగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చందానగర్ పీజేఆర్‌ఎన్‌క్లేవ్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం అయ్యప్ప మాలధారణ భక్తుల ఇరుముడి వేడుక కోలాహలంగా నిర్వహించారు. 41, 51, రోజులు అయ్యప్పమాల దీక్ష పూర్తి కావడంతో శబరిమల యాత్రకు ఇరుముడులతో భక్తులు బయలు దేరతారు. ప్రసాద్ గురుస్వామి ఇరుముడులను స్వాములకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో స్వాములకు భిక్ష, అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, రామకృష్ణ తదితరులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- 10న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి

బర్కత్‌పుర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఫీజుల పోరును ప్రజా ఉద్యమంగా మారుస్తామని, లా అండ్ ఆర్డర్ సమస్య తప్పదని ఆయన హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముట్టడి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతుందన్నారు. విదేశీ విద్య పథకం కింద రూ.20 లక్షల స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని, బీసీ కళాశాల హాస్టళ్లు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను రూ.200 కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు నీల వెంకటేష్, జి.మల్లేష్‌యాదవ్, సి.రాజేందర్, జిల్లపల్లి అంజి, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తిలో పెరుగుతున్న రసాయనికీకరణ

- పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు నర్సింహా రెడ్డి

అమీర్‌పేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఆహార ఉత్పత్తిలో రసాయనికీకరణ పెరుగుతోందని పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు డాక్టర్ నర్సింహా రెడ్డి విచారం వ్యక్తం చేవారు. అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులు, కలుపు సంహారకాల ప్రతికూల ప్రభావాలపై జాతీయ సింపోజియం అమీర్‌పేటలోని సెస్ ఆడిటోరియంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం అంతటా ప్రమాదకరమైన పురుగుమందులను పిచికారీ చేయడం వల్ల గ్రామీణ కుటుంబాలు బలహీణపడుతున్నాయన్నారు. ప్రతి పంట సీజన్‌లో భోపాల్ గ్యాస్ ట్రాజెడి మాదిరిగా ప్రతి గ్రామం గ్యాస్ చాంబర్‌గా మారీ గ్రామీణ పరిసరాలు దయనీయమైన స్థితిలో ఉన్నయని పేర్కొన్నారు. అనంతరం పాన్ ఇండియా సీఈఓ మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా ఎగుమతి చేయబడిన, దిగుమతి చేసుకున్న పురుగుమందులలో ఎచ్‌ఎచ్‌పీలు ఉన్నాయని భారతదేశంలో నమోదు చేయబడిన ఈ హెచ్‌హెచ్‌పీలను చాలా వరకు భద్రత కోసం సరిగా అధ్యయనం చేయలేదని ఎందుకంటే అవి క్రిమిసంహారక చట్టం 1968 అమలులోకి రావడానికి ముందు వాడుకలో ఉన్నాయన్నారు. ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ హెచ్‌హెచ్‌పీలపై నిషేధాన్ని సమర్థించడంలో ప్రచారకులు ప్రయత్నాల్లో ఉండాలని వైద్య సోదరులకు ఉద్బోధించారు. పాన్ ఇండియా నుంచి హీరా సీకే, రోష్నీలు కలుపు సంహారకాలపై తమ పరిశోధన ఫలితాలను సమర్పించారు. మన ఆహారం, గాలి, నీరు, నేల విషపూరిత వ్యవసాయ రసాయనలతో కలుషితమైందని పరిశోధనలో వెల్లడించారు. జీవవైవిధ్యాన్ని పురుగుమందుల ప్రతికూల ప్రభావాల నుండి రక్షించడానికి దేశంలో అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులు, కలుపు సంహారకాలను నిషేధించాల్సిన తక్షణ అవసరాన్ని ఈ సింపోజియం డిమాండ్ చేసింది. కార్యక్రమంలో రెండు నివేదికలను విడుదల చేశారు.

జేఎన్‌టీయూకు వీసీ ఉన్నట్టా.. లేనట్టా!

- టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా నియామకంతో ఖాళీగా వీసీ పోస్టు
- అంబేడ్కర్ వర్ధంతి సభ షెడ్యూల్‌లో వీసీ కోసం స్లాట్ పెట్టిన జేఎన్‌టీయూ అధికారులు
- వైస్ చాన్స్‌లర్ ఎవరు!
- విద్యార్థులు, ఆచార్యుల్లో అయోమయం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జేఎన్‌టీయూకు ఉపకులపతి ఉన్నట్టా, లేనట్టా.. అని ఇటు విద్యార్థులు, అటు ఆచార్యులు సంశయంలో కొట్టుమిట్టాడుతున్నారు. గత మే నెల 21న వైస్ చాన్స్‌లర్‌గా కట్టా నర్సింహారెడ్డి పదవీ కాలం ముగియడంతో.. 22నుంచి ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టారు. అయితే, నవంబరు 30న ఆయన్ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో.. జేఎన్‌టీయూకు ఇన్‌చార్జి వీసీగా ఆయన పదవీకాలం కూడా ముగిసినట్టయింది. గత వారం రోజులుగా ఇన్‌చార్జి కానీ, రెగ్యులర్‌గా కానీ ప్రభుత్వం ఎవరినీ నియమించక పోవడంతో వైస్‌చాన్స్‌లర్ పోస్టు ఖాళీగానే ఉంటోంది. ఫలితంగా యూనివర్సిటీలో అభివృద్ధి పనులు, అకడమిక్ అంశాలపై నిర్ణయం తీసుకునేందుకు పెద్దదిక్కు లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే, ఎక్కడి ఫైళ్లు అక్కడే నిలిచిపోయాయి.

డిప్యూటీ సీఎం షెడ్యూల్‌లో 'వీసీ'కి స్లాట్!

జేఎన్‌టీయూలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరు కానున్నట్టు వర్సిటీ ఉన్నతాధికారులు ప్రకటించారు. ఈ మేరకు అంబేడ్కర్ వర్ధంతి సభ షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. యూనివర్సిటీకి వీసీ పోస్టులో రెగ్యులర్ లేదా ఇన్‌చార్జిగా ప్రభుత్వం ఎవర్నీ నియమించక పోయినప్పటికీ, మీటింగ్ షెడ్యూల్‌లో మాత్రం వైస్ చాన్స్‌లర్ ప్రసంగానికి (మధ్యాహ్నం 12.15 గంటల నుంచి 12.30గంటల వరకు) స్లాట్‌ను పెట్టారు. తమ యూనివర్సిటీకి వీసీ ఎవరో ఎవరికీ తెలియకున్నా, ఆయన ప్రసంగానికి మాత్రం 15 నిమిషాలు కేటాయిస్తూ రిజిస్ట్రార్ పేరిట విడుదలైన సర్క్యులర్.. యూనివర్సిటీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇంతకీ మన యూనివర్సిటీకి వీసీ ఎవరబ్బా అంటూ అయోమయంగా ఒకర్ని మరొకరు ప్రశ్నించుకుంటున్నారు.

సమస్యలు పరిష్కరిస్తారా!

ఆర్నెల్లుగా వర్సిటీకి వైస్ చాన్స్‌లర్ లేకపోవడం, గత పదేళ్లుగా యూనివర్సిటీకి రావాల్సిన గ్రాంట్లు అందకపోవడం, వర్సిటీ అనుబంధంగా ఉన్న కాలేజీల్లో బోధన, బోధనేతర సిబ్బంది కొరత.. తదితర అంశాలపై డిప్యూటీ సీఎంకు వినతిపత్రాలు ఇవ్వాలని విద్యార్థి సంఘాల, ఆధ్యాపక సంఘాల ప్రతినిధులు సన్నద్ధమవుతున్నారు. డిప్యూటీ సీఎం రాకతోనైనా తమ యూనివర్సిటీకి సంబంధించి ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. పనిలో పనిగా యూనివర్సిటీలో రూ. 50 కోట్లతో నిర్మించిన గోల్డెన్ జూబ్లీ భవనాన్ని కూడా డిప్యూటీసీఎం చేతుల మీదుగా ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



జేఎన్‌టీయూ పరిపాలనా భవనం

ఇన్‌చార్జి వీసీ పోస్టుకు పెరిగిన పోటీ

జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ పోస్టుకు రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే ప్రత్యేకత ఉంది. జాతీయ స్థాయిలో అతిపెద్ద సాంకేతిక విశ్వవిద్యాలయం కావడంతో ఈ యూనివర్సిటీ వీసీ పోస్టును అర్హత కలిగిన ప్రొఫెసర్లందరూ ప్రతిష్టాత్మకంగా భావిస్తారు. రాష్ట్రంలో ఏ యూనివర్సిటీకి రాని విధంగా జేఎన్‌టీయూ వీసీ పోస్టుకు 100కు పైగా దరఖాస్తులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన ప్రొఫెసర్ల నుంచి రావడమే ఇందుకు నిదర్శనం. అయితే.. అనివార్య కారణాలతో జేఎన్‌టీయూ వీసీ నియామకం ఆలస్యం కావడంతో ఇన్‌చార్జి వీసీ పోస్టుకోసం కూడా పోటీ నెలకొంది. నిన్న మొన్నటివరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఇన్‌చార్జి వీసీగా ఉండగా, ప్రస్తుతం ఆయన పోస్టులో అదనపు బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారికి జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ఉన్న డాక్టర్ బాలకిష్టారెడ్డి లేదా ఉస్మానియా యూనివర్సిటీకి వీసీగా ఉన్న ప్రొఫెసర్ కుమార్ కూడా ఇన్‌చార్జి వీసీగా నియమితులయ్యే అవకాశం ఉన్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వర్సిటీ నుంచి వీసీ పోస్టుకు దరఖాస్తు చేసిన కొందరు సీనియర్ ప్రొఫెసర్లు కూడా తాత్కాలిక వీసీగా అయినా బాధ్యతలు చేపట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. జేఎన్‌టీయూ వీసీ నియామకంపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని, రెగ్యులర్ లేదా ఇన్‌చార్జి వీసీని తక్షణం నియమించి ఈ ఉత్కంఠకు తెరదించాలని విద్యార్థి సంఘాలు, అధ్యాపక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.31, వంకాయ రూ.23, బెండకాయ రూ.28, పచ్చి మిర్చి రూ.25, బజ్జి మిర్చి రూ.25, కాకర కాయ రూ.20, బీరకాయ రూ.32, క్యాబేజీ రూ.23, బీన్స్ రూ.28, క్యారెట్ రూ.45, గోబి పువ్వు రూ. 23, దొండకాయ రూ.28, చిక్కుడు కాయ రూ. 35, గోరు చిక్కుడు రూ.23, బీట్ రూట్ రూ. 43, క్యాప్సికం రూ.58, ఆలుగడ్డ రూ.35, కీర రూ.18, దోసకాయ రూ.23, సొర కాయ రూ. 20, పొట్లకాయ రూ.20, కంద రూ. 60, ఉల్లిపొరక రూ.45, ఉల్లిగడ్డ రూ.49, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ. 8-9, చామగడ్డ రూ.35, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.40, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.18-20, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ. 160, వెల్లుల్లి రూ.400, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.40, కరివేపాకు రూ.80, పర్వల్ రూ.45, పల్లికాయ రూ. 55, లోబా రూ.20, ఆ కాకరకాయ రూ.95. పైన పేర్కొన్న ధరలు శనివారం ఉదయం 9.30 వరకు అందుబాటులో ఉంటాయి.

రేపు దివ్యాంగుల దినోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో శనివారం కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ వద్ద ప్రపంచ దివ్యాగుల దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధ్యక్షుడు వెంకటస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని దివ్యాంగులందరూ హాజరై బ్యాటరీ సైకిల్స్, వీల్ చైర్స్, చంక కర్రలు తీసుకోవాలని కోరారు.

హామీలను అమలు చేయాలి

గచ్చిబౌలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మభ్యపెడుతోందని బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ఆరోపించింది. హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, మూసీ ప్రక్షాలన అంటూ కాలయాపన చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించడంలో సీఎం రేవంత్ రెడ్డి దిట్టని ఆయన విమర్శించారు. గురువారం రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నేరవేర్చేంత వరకు పోరాటం చేస్తామన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటి అమలు చేయకుండా రోజుకో వాగ్దానం ఇస్తున్నారని వారిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ ఏడాది పూర్తిచేసుకుందన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల పేరుతో మరో కొత్త నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. రైతులు పండించిన పంటలు కొనలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, గత బీఆర్‌ఎస్‌లానే ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, మణిభూషణ్, బుచ్చిరెడ్డి, నాగులుగౌడ్, ఎల్లేశ్, రాంరెడ్డి,నర్సింగ్‌రావు, ఆంజనేయులు సాగర్, శ్రీనివాస్ యాదవ్, జితేందర్, కోటేశ్వరరావు, శివా సింగ్, చంద్రశేఖర్‌యాదవ్, అజిత్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్



ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

ఒడిశా నుంచి నగరానికి హ్యాష్ ఆయిల్

- పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్టు
- రూ. 5 లక్షల విలువైన సరుకు, కారు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒడిషా నుంచి హైదరాబాద్‌కు హ్యాష్ ఆయిల్‌ను గుట్టుగా సరఫరా చేస్తున్న నిందితున్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ. 5 లక్షల విలువైన 1.5 కేజీల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకు చెందిన కొండె మల్లికార్జున్, హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రహమాన్ ఖాన్ ఒడిశాలో హ్యాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ టీమ్ పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. గురువారం తెలిసిన విశ్వసనీయ సమాచారం మేరకు చందానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో దాడిచేసి కారులో తరలిస్తున్న హ్యాష్ ఆయిల్‌ను, కారును స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌టీఎఫ్ టీమ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఇదే టీమ్ పురానాపూల్ ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడిచేసి 1.1 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు.

భవనం పైనుంచి పడిన కస్తూర్బా విద్యార్థిని

- ఘటనపై అనుమానాలు



రేణుక

రామాయంపేట/అడ్డగుట్ట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాల భవనంపై నుంచి పడి విద్యార్థిని గాయాలైన సంఘటన మెదక్ జిల్లా రామాయంపేటలో జరిగింది. గురువారం ఈ ఘటన జరగగా, పాఠశాల సిబ్బంది విషయాన్ని బయటకు రానివ్వలేదు. మొదట చిన్న గాయమైనని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అయితే, విద్యార్థిని ఎముకలు విరినట్లు తెలియడంతో గురువారం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరా లు ఇలా ఉన్నాయి. రామాయంపేట వడ్డెర కాలనీకి చెందిన రేణుక కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కొన్ని రోజుల నుంచి ఆమె గైర్హాజరు కాగా, రెండు రోజుల క్రితమే పాఠశాలకు వెళ్లింది. బుధవారం సాయంత్రం పై అంతస్తుపై దుస్తులు ఆరేసేందుకు వెళ్లి.. మెట్లపై నుంచి పడి కింది అంతస్తు వరకు దొర్లుతూ వచ్చినట్లు పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. గమనించిన వారు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. గురువారం ఉదయం వరకూ విద్యార్థిని ఆరోగ్యం కుదుట పడకపోవడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసి మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజనీలు గురువారం పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. ప్రిన్సిపాల్ విద్యార్థినితో పాటే ఆస్పత్రిలో ఉండటంతో పూర్తి వివరాలు తెలియరాలేదు.

నిజాయితీగా పని చేస్తే పేరు ప్రతిష్ఠలు

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : పోలీసులు వృత్తి నిబద్ధత, నిజాయితీగా పని చేసినప్పుడే ప్రజల్లో మంచి పేరు వస్తుందని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. నూతనంగా ఎంపికైన ఎస్సైలు, పోలీసు సిబ్బందికి ఏడు రోజుల నుంచి పేట్ బషీరాబాద్ పీఎస్ సమావేశ మందిరంలో ఆయన పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములుతో కలిసి వారికి పోలీసు వృత్తిపై శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎప్పటికప్పుడు కేసులను ఛేదిస్తూ వృత్తి నైపుణ్యంలో తమ ప్రతిభను ప్రదర్శించినప్పుడే వ్యవస్థలో మంచి పేరుప్రతిష్ఠలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ కూకట్‌పల్లి అధ్యక్షుడిగా ఎండీ సలీం ఉద్దీన్



సలీం ఉద్దీన్‌ను సత్కరించి స్వీట్ తినిపిస్తున్న మోయిజ్ తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎండీ సలీం ఉద్దీన్ 1258 ఓట్లతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మోయిజ్, సతీష్‌రెడ్డి తదితరులు సలీంను సత్కరించి, స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. తనకు ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ సలీం కృతజ్ఞతలు తెలిపారు. యువతను పార్టీలోకి ఆహ్వానించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్ కృష్ణయ్య, రామకృష్ణ తదితరులు

బర్కత్‌పుర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ ఆర్. కృష్ణయ్య తెలిపారు. బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఫీజుల పోరును ప్రజా ఉద్యమంగా మారుస్తామని, లా అండ్ ఆర్డర్ సమస్య తప్పదని ఆయన హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముట్టడి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతుందన్నారు. విదేశీ విద్య పథకం కింద రూ. 20లక్షల స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని, బీసీ కళాశాల హాస్టళ్లు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను రూ.200 కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు నీల వెంకటేష్, మల్లేష్ యాదవ్, సి.రాజేందర్, జిల్లపల్లి అంజి, నందగోపాల్ పాల్గొన్నారు.

లులు మాల్‌లో సీఫుడ్ ఫెస్టివల్



సీ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): లులు మాల్‌లో గురువారం లులు మాల్ స్టేట్ రీజనల్ డైరక్టర్ ఖదీర్, లులు హైపర్ మార్కెట్ జీఎం విమేష్‌తో కలిసి తెలంగాణ ఫిషరీస్ డిపార్ట్‌మెంటు అడిషనల్ డైరెక్టర్ డా.ఎస్.మురళీకృష్ణ సీ-ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో ఫుడ్ ప్రియులను దృష్టిలో ఉంచుకుని జాతీయంగా వివిధ ప్రదేశాల్లో దొరికే అన్ని రకాల సీ-ఫుడ్స్ ఇక్కడ అందుబాటులో ఉంచడం సంతోషంగా ఉందన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో దొరికే చేపలు నగర వాసులకు అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు సీ-ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణా నాయక్ తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సీపీఎం మహాసభలను విజయం వంతం చేయాలని ఆ పార్టీ కూకట్‌పల్లి మండల నాయకుడు కె.కృష్ణానాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈనెల 7,8 తేదీల్లో ప్రగతినగర్‌లో నిర్వహించనున్న మహాసభల పోస్టర్‌ను గురువారం కేపీహెచ్‌బీ రమ్యాగ్రౌండ్ వద్ద ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, చిరంజీవి, గోపాలు, మగ్యా, కృష్ణ, బాలు, భాష, గోబ్రియా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అస్తిత్వంపై సీఎం దాడి

- రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్



గతంలో రూపొందించిన తెలంగాణ తల్లి, భారత మాత నమూనా చిత్రాలను ప్రదర్శిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు

పంజాగుట్ట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తున్నారని, తెలంగాణ తల్లి రూపం మార్చే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆరోపించారు. తెలంగాణ తల్లి కిరీటం, బతుకమ్మ తీసేస్తామని అనడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్.ఉపేంద్ర, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్తి నరసింహ, విద్యాసాగర్‌లతో కలిసి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసి నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నాడని, దీనిలో భాగంగానే తెలంగాణ తల్లి రూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సమైక్యవాదుల కనుసన్నల్లో ప్రజాపాలన చేస్తున్న సీఎం తెలంగాణ అస్తిత్వంపై జరిపే దాడిని ఖండిస్తున్నామని అన్నారు. మూడు కోట్లకు పైగా ఉన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అస్థిత్వానికి ప్రతి రూపమే తెలంగాణతల్లి అన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి పుట్టిందే తెలంగాణ తల్లి అన్నారు. తెలంగాణ తల్లి రూపం మార్చే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలన్నారు. తెలంగాణలో సమృద్ధిగా పండే పంటలు, బతుకమ్మ, పట్టు వస్త్రాలు ధరించి వైభవంగా చూపాలని ఆలోచన చేశారు. రూపాన్ని మారిస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

క్యాబినెట్ మంత్రులకు కూడా తెలియకుండా రహస్యంగా విగ్రహం తయారు చేయిస్తున్నారని, ఎందుకీ రహస్యం అన్నారు. తెలంగాణ తల్లి రూపం తెచ్చిన సమయంలో ప్రొఫెసర్ కోదండరామ్ కూడా ఉన్నారు. ఇప్పుడు మారుస్తామని చెప్తే ఎలా అని ప్రశ్నించారు. కాకతీయ తోరణం, చార్మినార్ కూడా తీసేస్తామని అంటున్నారు. రూపం ఎందుకు మార్చే ప్రయత్నం చేస్తున్నారు. విగ్రహం రూపం మారుస్తుంటే కోదండరామ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చరిత్ర మీద అవగాహన లేకనే రేవంత్ రెడ్డి అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.